కాగజ్‌నగర్: క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, సతీమణి రమాదేవి

రెబ్బెన: గోలేటి ఐఎంఐ చర్చిలో కేక్ కట్ చేస్తున్న క్రైస్తవులు

అట్టహాసంగా క్రిస్మస్ వేడుకలు

- సందడిగా మారిన చర్చిలు
- ప్రత్యేక ప్రార్థనలు చేసిన క్రైస్తవులు

ఆసిఫాబాద్ టౌన్, డిసెంబర్ 25 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా క్రైస్తవులు సోమవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. చర్చిలను అందంగా ముస్తాబు చేశారు. రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. జిల్లా కేంద్రంలోని పలు చర్చిల్లో ఎమ్మెల్యే కోవ లక్ష్మి పాల్గొని చిన్నారులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం క్రైస్తవులకు క్రిస్మస్ కానుకలు అందజేస్తూ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, సహకార సంఘం చైర్మన్ అలీ, యువ నాయకుడు కోవ సాయి, శ్రావణ్ పాల్గొన్నారు.

వాంకిడి, డిసెంబర్ 25 : మండల కేంద్రంలోని సమృద్ధి జీవ సహవాస ప్రార్థన మందిరంలో పాస్టర్ ప్రభాకర్ కేక్ కట్ చేశారు. క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

రెబ్బెన, డిసెంబర్ 25 : మండలంలోని వివిధ చర్చిల్లో సోమవారం క్రిస్మస్ సందర్భంగా పాస్టర్లు కేక్ కట్ చేసి, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు చర్చిలకు వెళ్లి క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్లు రాజరత్నం, రవికుమార్, సంఘ పెద్దలు రాజలింగు, లింగంపల్లి ప్రభాకర్, లింగయ్య, అరికిల్ల పోశం, దేవీదాస్, దుర్గం జనార్దన్, దాసుబాబు పాల్గొన్నారు.

కెరమెరి, డిసెంబర్ 25: మండల కేంద్రంలోని చర్చిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాస్టర్ ప్రేంకుమార్ ఉపదేశమిచ్చారు.

జైనూర్, డిసెంబర్ 25 : మండల కేంద్రంలోని ట్రుఫ్రెండ్స్ బాప్టిస్ట చర్చిలో చిన్నారులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఫాస్టర్ ఎలియా, క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(యు), డిసెంబర్ 25 : మండల కేంద్రంలోని చర్చిలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆత్రం భగవంత్‌రావ్ క్రైస్తవులను కలిసి క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపి కేక్ కట్ చేశారు. క్రైస్తవులకు క్రిస్మస్ కానుకలు అందజేశారు. ఈ వేడుకల్లో జంగు పాస్టర్, గ్రామస్తులు నాగోరావ్, వెంకటేశ్, సోయం భుజంగ్‌రావ్, జే శంకర్, శ్రావణ్ పాల్గొన్నారు.

సిర్పూర్(యు): కేక్ కట్ చేస్తున్న మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆత్రం భగవంత్‌రావ్

క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే దంపతులు

కాగజ్‌నగర్, డిసెంబర్ 25 : కాగజ్‌నగర్‌లోని చర్చిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, సతీమణి రమాదేవి వేడుకల్లో పాల్గొని క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని సిర్పూర్ మండలానికి వెళ్లే ప్రధానరహదారి, ఫాతిమా కాన్వెంట్ సమీపంలోని, గాంధీనగర్ ప్రాంతాల్లోని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

కౌటాల, డిసెంబర్ 25: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పాల్గొని క్రైస్తవులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమాల్లో పాస్టర్ టోం థామస్, పాల్గొన్నారు.

బెజ్జూర్, డిసెంబర్ 25 : మండల కేంద్రంతో పాటు మర్డిడి, ముంజంపల్లి, సలుగుపల్లి, బొగడగూడ, సోమిని గ్రామాల్లో క్యాథలిక్, ప్రొటెస్టెంట్ చర్చీల్లో పాస్టర్లు కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అలాగే క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

పెంచికల్ పేట్, డిసెంబర్ 25: మండలంలోని ఎల్లూరు చర్చితో పాటు ఆయా గ్రామాల్లోని చర్చిలో ఫాదర్ సైజు, మిథున్, బ్రదర్ హాసన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లెడ గ్రామంలో విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో క్రైస్తవులు పాల్గొన్నారు.

దహెగాం, డిసెంబర్ 25 : దహెగాంతో పాటు చిన్నరాస్పల్లి, గిరివెల్లి, ఏసయ్యపల్లి, కమ్మర్‌పల్లి గ్రామాల్లోని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అదేవిధంగా కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

పెంచికల్ పేట్: జిల్లెడలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న చిన్నారులు

బెజ్జూర్: సోమినిలో కేక్ కట్ చేస్తున్న పాస్టర్లు అఫ్రైన్, డేవిడ్

వరి కోత యంత్రాలకు భలే గిరాకీ

- హార్వెస్టర్ల వినియోగంపై రైతుల ఆసక్తి
- గిరాకీ ఎక్కువగా ఉండడంతో ఎదురుచూపులు

రెబ్బెన, డిసెంబర్ 25: వ్యవసాయరంగంలో ప్రతీ సంవత్సరం కొత్త కొత్త మార్పులు చోటు చేసుకుంటున్నాయి. కూలీల కొరత విపరీతంగా ఉండడంతో రైతులు యంత్రాలపై ఎక్కువగా ఆధారపడుతున్నారు. ప్రస్తుతం వరికోతలు మమ్మురంగా సాగుతుండడంతో వరికోత యంత్రాలకు గిరాకీ పెరిగింది. కూలీలకు బదులు యంత్రాలతో గంటల వ్యవధిలోనే పంట చేతికి వస్తుండడంతో రైతులు చాలా మంది యంత్రాల వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా వర్షాలు మంచిగా పడడంతో వరి సాగు బాగా పెరిగింది. వరికోతలు ఒకే సారి రావడంతో కూలీలు దొరకక పొవడంతో యంత్రాలకు గిరాకీ పెరిగింది. వివిధ జిల్లాలు, పక్క రాష్ట్రాల నుంచి కూడా యంత్రాలు తీసుకరావడంతో రైతులు వరికోత యంత్రాలకు అడ్వాన్స్‌గా నగదు చెల్లించి పనులు చేయించుకుంటున్నారు. 1గంట కోతకు నార్మల్ టూ వీలర్ హార్వెస్టర్‌కు రూ.2,200 వేలు, ఫోర్ వీల్ హార్వెస్టర్‌కు రూ.2,800 నుంచి రూ. 3,000లు, చైన్ ట్రాక్ హార్వెస్టర్‌కు రూ.3000 నుంచి 3500 రూపాయలు చార్జి చేస్తున్నారు. తడిగా ఉండని పొలం గంటన్నర పడితే, బురద లేక తడిగా ఉండే పొలం 2గంటల సమయంలో కోస్తున్నారు. వరికోత యంత్రాల విధానమే బాగున్నప్పటికీ వరిగడ్డి అవసరం ఉన్న రైతులు మాత్రం యంత్రాల సహాయం తీసుకోకుండా కూలీల సహాయంతో కోతకోసి, కుప్పపెట్టి ధాన్యం తీస్తున్నారు. సీజన్ కావడంతో హార్వెస్టర్ కలిగిన యజమానులు గ్రామాల్లో పర్యటిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

నంబాల గ్రామ శివారులో హార్వెస్టర్‌తో వరి కోతలు

యంత్రాలు కూడా దొరకడం లేదు

పొలాల్లో వరి పంట కోతకు సిద్ధంగా ఉంది. కూలీల కొరత తీవ్రంగా వేధిస్తున్నది. కోతలకు ఎవరూ రాకపోవడంతో వరి పంట చేలల్లోనే ఉంది. హార్వెస్టర్ యంత్రాలకు గిరాకీ ఎక్కువగా ఉండడంతో దొరకడం లేదు. పంట పొలాల్లో వరికోత కోసం రైతులు ఎదురు చుస్తున్నారు. కూలీలు దొరకక యంత్రాలు దొరకక రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. **-కుందారపు శంకరమ్మ, మహిళ రైతు, రెబ్బెన**

ఇల్లారిలో కొలువుదీరిన దేవతలు

గొంతెమ్మ దేవర వద్ద నూతనంగా తీసుకొచ్చిన విగ్రహాలు

పెంచికల్ పేట్, డిసెంబర్25 : ఆదివాసీ గిరిజనుల సాంప్రదాయాలు, సంస్కృతి అంతరించిపోకుండ కాపాడుకునే బాధ్యత అందరిపై ఉందని గొంతెమ్మ (గౌతమి దేవి) ఆలయ పూజారి మానపల్లి రాజన్న పేర్కొన్నారు. మండలంలోని అటవీ ప్రాంత గిరిజన గ్రామం మేరెగూడ సమీపంలో గల గొంతెమ్మ ఇల్లారిలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం వరకు భాజాభజంత్రీలు, ఆటపాటలతో నూతన దేవతలు కొలువుదీరాయి. చిన్న బోయిన చిన్నన్న, హనుమంతు, బాపు, గొంతు బాయి, పార్వతి, లక్ష్మి, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

యువతకు సైనిక శిక్షణ

జైనూర్ డిసెంబర్ 25 : సమతా సైనికుల ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం కొండిబాగూడా బుద్ధ విహార్ ప్రాంగణంలో సమతా సైనికులు శిక్షణ శిబిరం నిర్వహించా రు. ఉమ్మడి జిల్లా నుండి వందలాది మంది సమతా సైనికులు బైక్ ర్యాలీ ద్వారా బౌద్ధ ధర్మ ప్రచారం చేశారు. సమతా సైనిక్ దళ్ మార్షల్ దీపక్ వాగ్మారే, బుద్ధ ఘోష్ భంతె, విశ్వభూషణ్, యువకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సామాజిక తనిఖీలు

దహెగాం, డిసెంబర్ 25 : మండలంలో చేపట్టిన ఉపాధి హామీ పనులపై మంగళవారం నుంచి సామాజిక తనిఖీలు చేపట్టనున్నట్లు ఏపీవో కల్పన తెలిపారు. 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి 31 వరకు చేపట్టిన పనులపై గ్రామాల్లో ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు సామాజిక తనిఖీలు చేపట్టనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

ప్రజా సమస్యలు ఎజెండాగా పని చేయాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, డిసెంబర్ 25: రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలే ప్రధాన ఎజెండాగా పని చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎస్ వీరయ్య పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని రోజ్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సీపీఎం జిల్లా స్థాయి ప్లీనరీకి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు అన్ని హామీలు సర్కారు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్, పార్టీ జిల్లా కార్యదర్శి కూశన రాజన్న, జిల్లా కార్యవర్గ సభ్యులు కోట శ్రీనివాస్, దుర్గం దినకర్, నాయకులు గొడిసెల కార్తీక్, ముంజం శ్రీనివాస్, ముంజం ఆనంద్ కుమార్, జే రాజేందర్, దుర్గం రాజ్ కుమార్, జాడి మల్లయ్య, టికానంద్ తదితరులు పాల్గొన్నారు.

బీఎంఎస్‌కు ఒక్క అవకాశం ఇవ్వండి

రెబ్బెన, డిసెంబర్ 25 : సింగరేణి కార్మికుల హక్కుల సాధన కోసం బీఎంఎస్ యూనియన్ కు ఒక్క అవకాశం ఇవ్వాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు పేర్కొన్నారు.న బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి సీహెచ్‌పీ, ఖైరిగూడ ఓసీపీ, గోలేటి వర్క్‌షాప్‌లో సోమవారం బీఎంఎస్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఎంఎస్ కేంద్ర కార్యవర్గ సభ్యులు పులి రాజారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అజ్మీరా ఆత్మారాం నాయక్, జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులు గౌడ్, పార్లమెంట్ కో కన్వీనర్ కొలిపాక కిరణ్ కుమార్, కృష్ణకుమారి, బీఎంఎస్ గోలేటి బ్రాంచ్ కార్యదర్శి మారేపల్లి అంబేద్కర్, మల్లికార్జున్, సొల్లు లక్ష్మి, గులభం చక్రపాణి, నాయకులు సునీల్ దరి, కుందారపు బాలకృష్ణ, నవీన్ గౌడ్ మల్రాజు రాంబాబు, ఎర్ర రాజేశ్, దుర్గం వసంతరావుతోపాటు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి కార్మికుల హక్కులను కాపాడుతాం

రెబ్బెన, డిసెంబర్ 25 : సింగరేణి కార్మికుల హక్కులను కాపాడుతామని ఐఎన్‌టీయూసీ సెంట్రల్ చీఫ్ కార్యదర్శి నరేందర్, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు పేర్కొన్నారు. బెల్లంపల్లి ఏరియాలోని ఖైర్‌గూడ ఓసీపీ, గోలేటి జీఎం కార్యాలయం, డిస్పెన్సరీలో సోమవారం ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు యూనియన్‌లో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్ సురిబాబు, ఎంపీటీసీ రవీందర్‌రెడ్డి, టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు మణిరాంసింగ్, నాయకులు సంగెం ప్రకాశ్‌రావు, సదానందం, రఫీక్, మాధవకృష్ణ, గెల్లి జయరాం, మిట్టపల్లి కుమారస్వామి, చంద్రకుమార్, అబ్బాస్, అనిల్‌గౌడ్, దుర్గం రవీందర్, కిషన్‌గౌడ్, సురేందర్‌రాజు, సాయి ఉన్నారు.

అన్నదానం.

కౌటాల, డిసెంబర్ 25 : శ్రీ సత్యసాయి సేవా సమితి కౌటాల, ముత్తంపేట, మొగడ్‌ధగడ్ వారి ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని మన్నెవార్ సేవా సంఘం భవనంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం తలోడి గ్రామానికి చెందిన ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు అభిమానులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

స్వాధీనం చేసుకున్న బులెరో వాహనం(చిత్రంలో నల్లని ముసుగులో కమల్ గోండ్, పువార్‌దేవి గోండ్, రాంవీర్ గోండ్, సలాం సింగ్ గోండ్‌లు)

పిల్లలు కలిగేలా చేస్తామని.. తెల్ల కాగితాలను నోట్లుగా మారుస్తామని..

- మోసగించిన నలుగురు ఘరానా మోసగాళ్ల అరెస్టు
- రూ.3 లక్షలిస్తే రూ.6 లక్షలిస్తామని నమ్మబలికి మోసం
- బులేరో, రెండు ద్విచక్ర వాహనాలు, నాలుగు సెల్‌ఫోన్‌లు, రూ.2.10 లక్షలు స్వాధీనం
- వీరందరూ కూడా మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారు
- స్వెట్టర్లు అమ్ముకుంటూ ఊరి చివర డేరాలు వేసుకొని నివాసం

ఇచ్చోడ, డిసెంబర్ 25 : ఆదిలాబాద్ జిల్లాలోని సిరికొండ మండలానికి మధ్యప్రదేశ్ నుంచి 20 మంది బృందం గల సభ్యులు వారం రోజుల క్రితం వచ్చారు. వీరు బృందాలుగా ఏర్పడి ఊరు శివారులో డేరాలు వేసుకొని ఉంటున్నారు. రాజంపేట శివారులో కూడా కమల్ గోండ్, పువార్‌దేవి గోండ్, రాంవీర్ గోండ్, సలాం సింగ్ గోండ్‌లు నివాసం ఏర్పరచుకున్నారు. ఈనెల 19వ తేదీన రాజంపేటలో స్వెట్టర్లు అమ్ముతుండగా.. జంగుకు పిల్లలు లేని విషయాన్ని గ్రామస్తుల ద్వారా తెలుసుకున్నారు. జంగును కలిసి మాకు మహారాజ్ తెలుసని, నీకు పిల్లలు కలిగేలా చేస్తామని, రూ.3 లక్షలు ఖర్చవుతాయని తెలిపారు. ఈనెల 20వ తేదీన ఇచ్చోడకు తీసుకెళ్లి మహాగిరి మహారాజ్‌ను కలిశారు. జంగు నుంచి మహారాజ్ రూ.3 లక్షలు తీసుకున్నాడు. మీ ఇంట్లో ధనలక్ష్మి లేదని, ఈ రూ.3 లక్షలను రూ.6 లక్షలు చేస్తానని చెప్పాడు. తన వద్ద ఉన్న ఒక డబ్బా, కెమికల్(సర్ఫు), రెండు అద్దాల్లో పెట్టి రెండు, మూడు తెల్లని కాగితాలను రూ.200, రూ.500 నోట్లుగా వచ్చినట్టు నమ్మించాడు. సర్ఫు అయిపోయిందని, డబ్బులు తరువాత తయారు చేసి ఇస్తానని మహారాజ్ చెప్పడంతో జంగు ఇంటికి వెళ్లాడు. ఈనెల 21వ తేదీన బృందం సభ్యులకు ఫోన్ కలువకపోవడంతో సిరికొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో నలుగురు, సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నలుగురు కానిస్టేబుల్స్ మూడు రోజులుగా వెతుకుతున్నారు. సోమవారం ఉదయం కమల్ గోండ్, రాంవీర్ గోండ్‌లు సిరికొండ మండలంలోని కొండా ఎక్స్‌రోడ్డు వద్ద, పవార్‌దేవీ గోండ్, సలాంసింగ్ గోండ్‌లు ఇచ్చోడ బస్టాండ్ వద్ద దొరికారు. వీరి వద్ద నుంచి ఒక బులేరో, రెండు ద్విచక్ర వాహనాలు, నాలుగు సెల్‌ఫోన్‌లు, రూ.2.10 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇంకా రూ.90 వేలు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. మోసగాళ్లను చాకచక్యంగా పట్టుకున్న సిరికొండ ఎస్సై శ్రీకాంత్, సీఐ చంద్రశేఖర్‌ను డీఎస్పీ నాగేందర్ అభినందించారు. దొంగలపై చీటింగ్ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

వాంకిడి, డిసెంబర్ 25 : మండల నాయకులు సోమవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే కోవ లక్ష్మి నివాసానికి వెళ్లి ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. పీఏఎంసీ చైర్మన్ పెంటు ఆమెకు శాలువాతో సన్మానించారు. మండల అభివృద్ధి పనులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. పీఏఎంసీ వైస్ ప్రెసిడెంట్ నేపాజీ, సరండి సర్పంచ్ దుర్గం కమలాకర్, పీఏఎంసీ కార్యదర్శి ఓమాజీ, సొసైటీ సభ్యులు దేవినేని గొల్ల, నాయకులు వనపర్తి సదాశివ్, బాపురావు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేను శాలువాతో సన్మానిస్తున్న పీఏఎంసీ చైర్మన్ జబోరే పెంటు

హన్మాండ్ల మల్లయ్య వర్ధంతి

రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న సభ్యులు

తిర్యాణి, డిసెంబర్ 25 : మాజీ జడ్పీటీసీ సభ్యుడు హన్మాండ్ల మల్లయ్య 22వ వర్ధంతిని మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల కేంద్రంలోని 30 పడకల దవాఖానలో రోగులకు పండ్లు అందజేశారు. క్రికెట్ పోటీలు నిర్వహించారు. ప్రథమ స్థానంలో చింతపల్లి జట్టు, ఈదులపాడు జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. విజేత జట్టుకు రూ.1016, రెండో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.8016 ను ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ హన్మండ్ల జగదీశ్ అందజేశారు. ఎంపీపీ మర్సుకోల శ్రీదేవి, జడ్పీటీసీ ఆత్రం చంద్రశేఖర్, సీఎస్ సీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్, వైస్ చైర్మన్ శ్రీనివాస్, ఏఎంసీ డైరెక్టర్ తాళ్ల శ్రీనివాస్ గౌడ్, నాయకులు ముత్యం రాజయ్య, కాసం రాజయ్య, గాయంగి మల్లేశ్,శంకర్ గౌడ్, తోట బాపు, హనుమాన్ల శంకరయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

చోరీలకు పాల్పడితే కఠిన చర్యలు

రెబ్బెన పోలీస్‌స్టేషన్ లో వివరాలు వెల్లడిస్తున్న అడిషనల్ ఎస్పీ అచ్చేశ్వర్‌రావు

రెబ్బెన, డిసెంబర్ 25: జిల్లాలో చోరీకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అడిషనల్ ఎస్పీ అచ్చేశ్వర్‌రావు హెచ్చరించారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లాలో జరిగిన పలు దొంగతనాల వివరాలు వెల్లడించారు. జిల్లాలోని పలు మండలాలకు చెందిన కే శ్రీధర్, డీ పోచయ్య, బీ శ్రీధర్, తిరుపతి, రహీం, నగేశ్, మహేశ్, విజయ్, యాకుబ్, శ్రీను జిల్లా వ్యాప్తంగా వివిధ మండలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు పగులగొట్టి వాటిలోని కాపర్ వైర్ దొంగిలించి అమ్ముకుంటున్నారు. ఈ క్రమంలో పలు మండలాల్లో కేసులు నమోదయ్యాయి. పోలీసులు విచారణ చేపట్టగా వీరందరూ పట్టుబడినట్లు అడిషనల్ ఎస్పీ తెలిపారు. వారి నుంచి 163 కిలోల కాపర్ వైర్, ట్రాలీ అటో, రెండు బైక్‌లు, 7మొబైల్ ఫోన్లు, వివిధ రకాల సామగ్రి సీజ్ చేసి వారిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఆసిఫాబాద్ డీఎస్పీ వెంకటరమణ, రెబ్బెన సీఐ అల్లం నరేందర్, ఎస్ఐ లు చంద్రశేఖర్, రమేశ్‌లు ఉన్నారు.

దుస్తుల పంపిణీ

రెబ్బెన డిసెంబర్ 25 : రెబ్బెన మండలంలోని పలు చర్చిల్లో క్రైస్తవులకు జడ్పీటీసీ వేముర్ల సంతోష్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు చెన్న సోమశేఖర్ దుస్తులు పంపిణీ చేశారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై దుప్పట్లు అందజేశారు. అనంతరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. మోడెం చిరంజీవి గౌడ్ బొమ్మినేని శ్రీధర్‌తో పాటు పలువురు ఉన్నారు.

నగదు, సామగ్రి అందజేత

కెరమెరి, డిసెంబర్ 25 : మండలంలోని ఖైరి గ్రామంలో శనివారం షార్ట్ సర్క్యూట్‌తో గ్రామానికి చెందిన మూడు ఇండ్లు దగ్ధమయ్యాయి. స్పందించిన వాంకిడి సీఐ శ్రీనివాస్, కెరమెరి ఎస్ఐ విజయ్ ఆధ్వర్యంలో అగ్ని ప్రమాద బాధితులకు పోలీసులు – మీకోసం కార్యక్రమంలో భాగంగా 75 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు, రూ. 5000 సాయం అందజేశారు. దాతలు సైతం ఈ అగ్ని ప్రమాద బాధితులకు సహాయం అందజేయాలని వారు కోరారు.